# దోషగుణం

"కొడుక్కి పట్టాభిషేకం చేసి ఆరాజూ రాణీ చాలా హాయిగా కులాసాగా కాలం గడిపారు."

అని రాత్రి చూసిన 'మంగమ్మ శపథం' కథ చెబుతున్నాడు తాత, తన మనుమలకీ, మనుమరాళ్ళకీ-సాయంత్రం బీచివొడ్డున కూచొని.

సినిమా కథమీద ఆసక్తి లేకపోయినా, తాత కథ చెప్పే నేర్పువల్ల తమ ఆఫీసుగొడవలు మాని అతనికి చెవులు వొప్ప చెప్పి వింటూ వుండిపోయారు. ప్రక్కన కూర్చున్న మునిసిపల్ గుమాస్తాలు, తాతా మనుమలూ లేచిపోతున్నారు. వినపడే రేడియో సంగీతానికి గంతులు వేసుకొంటూ. తాత గంతుల్ని చూసి ఈర్ష్యపడే రంగం "చూశావా, పాతకాలపువాళ్ళ వుత్సాహం. అంతకాలం మనం బ్రతకం. బ్రతికినా ఆ కులాసా మనకి వుండదు" అన్నాడు.

"ఎందుకు ఇట్లా అవుతుందంటారు జీవితం ?" అన్నాడు సూరాయ్.

"కలియుగం !"

"నాన్సెన్సు! క్రమంగా మన అలవాట్లూ, పట్టణంలో జీవితం, మరబియ్యం, సారంలేని మజ్జిగా, వీటివల్ల దేహంలో బలంపోయి నీరసపడుతున్నాము."

"దీనకంతా రాజకీయ బానిసత్వం కారణం" అన్నాడు, జాన్.

"ఏం ? గవర్నమెంటు మన్ని దంపుడుబియ్యం తినవొద్దన్నారా?"

"తినవొద్దనలేదులే. ప్రభుత్వం మరబియ్యం తినకుండా చెయ్యాలి."

"అప్పుడేమో, మా వ్యక్తి స్వాతంత్ర్యం తీసేశారో అని గోలెత్తుతారు. రష్యాలో బలవంతంగా ప్రజల్ని సుఖపెడుతున్నారనేగా వాళ్లమీద అంత దుమ్మెత్తి పోస్తున్నారు ?"

"ఏమైనా అను; పాతపద్ధతులే మంచివనుకో. ఈ డెమాక్రసీలూ, "కమ్యూనిజము"లూ, ఈ ప్రజాపరిపాలన లున్నాయే అవి చాలా అశాంతి. ఘోరం తెచ్చిపెట్టాయి. సర్వాధికారాలూ వున్న ఒక్క రాజువుంటే ఎవడూ నోరెత్తడు."

"మరి డిక్టేటరు అంటే అదేగా ?"

"కాని ప్రతివాడూ తాను ఆ డిక్టేటరే కావాలని చూస్తాడు. ఇంకా రాజులే నయం."

"మంగమ్మ శపథంలో మల్లే, కొవ్వెక్కిన పంతాలు పట్టడానికే రాజులు. వాళ్లకి పరిపాలన మీద దృష్టి కూడానా?"

"సరేగాని, ఏమిటా శపథం? ఆ పాతకథలైనా ఏదో నమ్మించేట్టుగా వుండవొద్దూ?"

"కొడుక్కి పట్టాభిషేకం చేసేప్పటికి ఆరాణికి ఎన్నేళ్లువుంటాయి? కనీసం నలభై. రాజుకి యాభై. అప్పుడు వాళ్లు కులాసాగా కాలం గడిపారని చూపి ఏం లాభం? యవ్వనమంతా పనిలేని పంతాలతో చచ్చి? అంతేకాదూ హరిశ్చంద్రుడు, శ్రీరాముడు-వీళ్లందరూ బ్రతికినన్నాళ్లూ కష్టాలుపడి, చనిపోయేముందు సుఖపడ్డారంటే అర్థమేమిటి?"

"మరి ఓ గొప్ప ప్రిన్సిపల్‌కి నిలబడ్డ మనుష్యుల జీవితాలన్నీ అంతేకదా."

"అవునులే. కాని వాళ్ళేదో సుఖపడ్డారని మనకళ్లని మోసపుచ్చుతారు కథకులు."

"కాని చాలా జీవితాలకి ఆ చివరిసుఖంకూడా లేకుండా పోతుంది."

"ఏ ఆదర్శానికో నిలబడి కష్టపడ్డవారికి, ఆ కష్టాలే సుఖం. ఏదో గొప్ప కార్యం నిర్వహిస్తున్నామనే తృప్తి. కాని మామూలు మనుష్యులు - జీవితమంతా కష్టమయమైన వాళ్లు ఎంతమంది లేరు?"

"దానికి మన ఆర్థికవ్యవస్థ కారణం. కష్టాలన్నిటికీ కారణం బీదతనమే."

"తక్కినవో- ! చావులు, అన్యాయాలు, మోసాలు."

"కర్మ"

"ఏమీ చెప్పలేక, అర్థంకాక, తెలీదని ఒప్పుకోడం ఇష్టంలేక కొందరు ఈశ్వరేచ్ఛ అనీ, కొందరు కర్మ అనీ ఈ కష్టాల్ని సమర్థిస్తారు."

"కష్టాల్నే కాదు, ముఖ్యంగా అన్యాయాల్ని, తమకు లాభంచేసే అన్యాయమైన పద్ధతుల్నీ, సంస్థల్నీ దేవుడిపేర నిలబెడుతున్నారు. అందుకే రష్యాలో దేవుణ్ణి బైటకు తరిమారు."

"నేను నిజంగా జరిగిన ఓ చరిత్రని చెపుతాను వినండి, ఏమంటారో" అన్నాడు, అంతవరకూ వూరికే కూచున్న డాక్టర్ జోసఫ్, జాన్ మేనమామ.

"నాలుగేళ్ళకిందట నేను రిటైర్ కాకముందు అదుగో ఆ ఆస్పత్రిలో పనిచేసేవాణ్ని. నా వార్డుముందు ఒక వృద్ధురాలు నుంచుని వుండేది. ఏడవడానికి శక్తిలేదు. అట్లా గొణుగుతో గొణుగుతో, ఆకాశంవేపు చూస్తో నుంచునేది. డాక్టర్లకీ ఎంతో పని చూడండి. అదిగాక డాక్టరు జీవితంలో ముఖ్యం ఆస్పత్రి. డాక్టరు జీవితంలో దిన దినమూ ఇట్లాంటి నిర్భాగ్యు లెందరో! మామూలై పోతుంది. ఎంతటి విషాదమూ హృదయాన్ని కదిలించడం మానేస్తుంది. యుద్ధం తలుచుకొంటే, ఆస్పత్రిలో అందరూ చచ్చే రోగులే. తలలు, కాళ్లు పగిలిన వాళ్లు. డొక్కల్లోంచి పేగులు వేళ్ళాడే వాళ్ళు. ప్రతివారూ "డాక్టర్, డాక్టర్, నన్ను-నన్ను చూడు" అని వందమంది ఒక్కసారిగా అరుస్తో వుంటారు. ఆ అరుపులకి హృదయం వూగిందా, ఒక్కపనీ సరిగాకాదు. పెద్ద ఆస్పత్రిలో అంతకన్న కష్టం. రోగులేకాదు, వారి బంధువులూ అరుస్తారు, ఏడుస్తారు-అందరిదీ నిజమైన అవసరమే. తన వార్డులో

వాళ్ళేకాదు, తక్కిన రోగుల గొడవకూడా చుట్టుకుంటుంది. జాలిపడే డాక్టరుకి. మందులేం చేస్తాయి, తిండిలేని రోగులకి? అది పోనీండి.

"నా పని తొందరలో నా మనసులో ఎక్కడో వుంది దిక్కులేనట్టు, అట్లా చూస్తూ నుంచున్న ఆ ముసలమ్మరూపం. ఓ రోజున నర్సులు ఆమె సంగతి మాటాడుతోవుంటే అడిగాను - ఆమె ఎవరని. నా వార్డులో ఊపిరితిత్తుల్లో వ్రణంతో చాలా అపాయంలో వున్న ఒకాయన తల్లి ఆమె. అతనికి నలభై ఏళ్లు. ఈ తల్లి అతనిదగ్గిరికి వస్తే తిడతాడట. అవతలకి ఈడ్చెయ్యమంటాడట. అతను నిద్రపోయ్యేప్పుడు లోపలికి వొచ్చి అతణ్ని చూసి చూసి ఏడుస్తుంది ఆమె. తక్కిన సమయాల్లో బైట అట్లా నుంచుంటుంది. ఆ సాయంత్రం ఆమెను దయగా పలకరించాను. తన కొడుకుని బతికించమని ఏడ్చింది. అట్లాంటప్పుడు డాక్టరు ఏం చెయ్యాలి? లేనిఆశ కల్పించి ఓదార్చడమో? లేక నిజంచెప్పి వాళ్ల గుండెల్ని చితకకొట్టడమో ఏది ధర్మమో, ఈ నలభైఏళ్లలోనూ నాకింకా నిర్ణయం కాలేదు....."నీ కొడుకుకి నీమీద ఎందుకంతా కోపం?" అని అడిగాను. "నా కర్మ" అంది. తర్వాత మాట్లాడలేదు. "కొడుకు దగ్గిరకి వెళ్ళి అడిగాను. "ఏమిటి నీతల్లి అట్లా ఏడుస్తోవుంటే ఎందుకంత కోపం? ఏ విరోధాలున్నా, ఇట్లాంటి సమయంలోనైనా మాట్లాడకూడదా?" అని.

"అదా?తప్పుడుమనిషి! దానిసంగతి ఎత్తకండి".

"ఏం చేసింది? అంత నువ్వు క్షమించలేనిది ఏం చేసింది? నీతల్లే!" అన్నా.

"అది తల్లా! ఏం చేసినా క్షమించవొచ్చు, కాని నా జీవితాన్నంతా దగ్ధంచేసింది. ఎందుకు దాని కడుపున పుట్టానా అని నలభై ఏళ్ళూ ఏడ్చేట్టు చేసింది. దాని సంగతి నాముందు ఎత్తకండి".

నాకు అతనిమీద సానుభూతి రాలేదు. అతను చెప్పినదంతా నిజమైనా ఈనాటి ఆమె దిగులు, ఆమె ప్రేమ చాలా వాస్తవం. ఆ రోగి దుర్మార్గుడుగా లేదు. వొంటరిట. సంసారం లేదట. బాగా చదువుకున్నవాడు. సంస్కారి. ఎవరి నేమనను?

తలిదండ్రుల ప్రేమ చాలా వాస్తవం. పిల్లలికి ఎప్పుడూ వుండదు ప్రేమ- ఏదో కృతజ్ఞతా, భక్తీతప్ప. ఇతరులు మనకిచేసే అపకారమే మనకి చాలా ఘనమైతే, మనం ఇతరులకి చేసే అపకారం ఎన్నటికీ గుర్తువుండదు. ఇంత పరస్పరా ప్రకృతి లోకంలో వున్నా, దానినంతా కడిగి తుడిచి వేసే మరుపూ, క్షమా, ప్రేమా వుండబట్టే లోకం నివాసయోగ్యమయింది.

మర్నాటినించి రోగిమీదకన్న తల్లిమీద నాకు శ్రద్ధ ఎక్కువయింది. కాని ఏ ఆదరణకీ దగ్గిర కాలేదు ఆమె కొడుకూ, కొడుకు ప్రాణం తప్ప ఆమె మనసులో ఏదీలేదు. ఏం అడగనీ, చెప్పనీ, "వాణ్ని బ్రతికించు. నాయనా" అని కాళ్ళా వేళ్ళా పడుతుంది.

"నీపేరు చెపితే ఉమ్మేస్తాడు. వాడు బతికితే ఎంత, చస్తే నీకెంత?" అన్నాను పట్టలేక. మాట్టాడలేదు.

పోనీ అతను ఆమెని పోషిస్తున్నాడా అంటే అదీ లేదు. ఎవరింట్లోనో చాకిరీట. అదీ మానేసుకుని ఆస్పత్రి ఆవరణలో కటికి నేలమీద కాపరంచేస్తోంది. ఏం ఘోరమైన అపచారం చేసిందో, పరిహారం చేసుకుంటోంది తన ఆత్మకి తానే అనుకున్నాను.

తరవాత రెండురోజులకి ఓరోజు శెలవుపెట్టాను, ఒక గెస్టు వస్తున్నానని వుత్తరం రాస్తే.

"గెస్టు ఒస్తానంటే శలవుపెట్టడ మెందుకు?" అని అడిగాడు రంగం.

"నీకెందుకు? శలవ పెట్టాను. కథ విను"

"ఆమె కథేగాని, మీ కథ చెప్పరా uncle !" అన్నాడు నవ్వుతో జాన్.

"మొగగెస్టా, ఆడగెస్టా!"అన్నాడు సూరాయ్.

"ఆడగెస్టే! మా అత్తయ్య చచ్చిపోయి ఇరవైఏళ్ళయింది."

"తాత్కాలిక అత్తయ్య అన్నమాట."

"కథ వింటారా లేదా?" అన్నాడు డాక్టరు.

"వింటాం, కానీండి"

"కాని ఆ గెస్టు రాలేదు"

"పాపం!"

"ఆరోజు రోగుల అవస్త దేవుడికి తెలియాలి." అన్నాడు సూరాయ్.

"నర్సులు లేరా, డాక్టర్."

"నేనే లేచిపోనా?" అన్నాడు డాక్టరు నవ్వుతో.

"ఇంక మాట్లాడం-చెప్పండి"

"ఇంటిదగ్గర వొంటరివాణ్ణి."

"అదీ సంగతి"

"నోరుముయ్యరా, విను కథ. ఏం తోచక ఆస్పత్రికి వెళ్ళి వరండాలో సముద్రంకేసి చూస్తో కూచున్నాను హాయిగా.

వరండాకి అటుపక్క కూచున్న ఇద్దరు నర్సులూ వాళ్ళ పక్కన నుంచున్న ముగ్గురు వైద్యవిద్యార్థులమాటలు వినపడుతున్నాయి నాకు. సరిగా నేను చెపుతున్నట్టే మాట్లాడారనుకోకండి. కథని reconstruct చేసి చెపుతున్నాను.

"ఎవరు ఇందాక అంత బంకలాగు పట్టుకుంది నిన్ను ?" అన్నాడు విద్యార్థి వెంకటప్ప.

"ఆమెది మా వూరే" అన్నాడు శ్రీనివాసులు.

"ఐతే నీ కన్నీళ్ళేమిటి?" అన్నాడు వెంకటప్ప.

"ఆమెని నే నెరగను. ఆమెకొడుకు మా అన్నయ్య క్లాస్‌మేట్. ఆమె కేదో చాలా చిత్రమైన romantic past వుందన్నారు ఎవరో."

ఆ మాటతో నా చెవుల్నీ, దృష్టినీ పూర్తిగా వాళ్ళకిచ్చేశాను. చీకిపోయిన స్క్రీను కాన్వాస్‌లోంచి వాళ్లు మసకగా కనపడుతున్నారు, ఆ ఉదయకాంతిలో.

"అందుకేనా అంత మాట్లాడావు?"

"నేను కాదురా. మానాన్న ఆమెకోసం చాలా ప్రయత్నం చేశాట్ట"

"సరేరా, ఇప్పుడు నీమీద ఆమె ప్రయత్నం ఏమిటి?"

"ఆమెకొడుకు ఇక్కడ-యీవార్డులోనే రోగి."

"ఎవరు? ఇరవైఒకటో నెంబరేనా? పాపం! ఆ ముసలామె ఏం ఏడుస్తుంది" అంది నర్సు బాలమ్మ, ఇంగ్లీషుకోసం మాటలు తడుముకుంటో.

డూషులూ, డోజులూ, మందులపేర్లు-అట్లాంటివి తప్ప తక్కిన జ్ఞానం చాలా తక్కువ ఆమెకి.

"సరే తల్లి అయింతర్వాత..."

"ఆ పేషంటు మాత్రం ఆమెతో మాట్లాడడు. ఆమెవంక చూడడు. విసిరికొడతాడు." అంది బాలమ్మ.

"ఏదో తిడుతున్నాడు. 'ఇన్నేళ్ళకి కనపడ్డానా? ఛీ. నీపాపిష్టి మొహం నాకు కనపరచకు' అంటున్నాడు, తన తల్లిని."

"ఏమిటోయ్ శ్రీనివాస్, ఆమెది మీ వూరన్నావు? ఆమె పూర్వ చరిత్రలో ఏమిటో విశేషమన్నావు? నీకేం తెలీదా ఆ సంగతి?"

"తెలీదు. వాళ్ళు మావూరువొదిలి చాలా ఏళ్ళయింది."

"రండి పోదాం" అన్నాడు మూడో అతను రిస్టు చూసుకుంటో.

"తొందరేం?" అని కనుకొలుకుల సందుల్లోంచి చూసింది ఆ రెండోనర్సు ఎలిజబెత్.

తమని ఎందుకు పురుషులు మోహించి వెంటపడరో వాళ్లకి అర్థంకాదు. సినీమా చీకట్లు చేతులు కలిపినా లైట్లు వెయ్యగానే, ఒకసారిచూసి కళ్ళు తిప్పుకుంటారు. వాళ్ళవేషాలు,

మాటలు చూసి ఓసారి పూర్తిగా దగ్గిరైనా. ఇంక జన్మఅంతా వాళ్ళకి కనపడకండా తప్పుకుంటారు.

"తొందరేమంటున్నావా? ఇవాళ ఆపరేషన్ రోజు. థియేటర్కి ఒక్క నిమిషం ఆలస్యమైనామా, మమ్మన్నే బల్లనెక్కమంటాడు ఆ మంగలి కోతలగాడు" అన్నాడు శ్రీనివాస్.

ముగ్గురు మొగవాళ్లూ వెళ్ళిపోగానే, నర్సులిద్దరూ కుట్లు పైకితీసి అల్లుకుంటో, స్వవిషయాలు మాట్లాడుకుంటున్నారు. చెట్లని పలకరిస్తో, తేనె టీగలకి చక్కలిగిలి పెడుతో తిరుగుతున్న చల్లని చిన్నగాలి గాని, సముద్రం నీళ్ళమీద నునుపెక్కి గోడలమీద ప్రతిఫలించే ఎండలోని నిండుతనంగాని వాళ్ళ హృదయాన్ని ఏమాత్రమూ తాకలేదు. వాళ్ళ పెద్దనర్సుకి రాత్రి బహుమానంగా వొచ్చిన పలావు లంచం అవునాకాదా అని చర్చిస్తున్నారు. కొంచెం సేపట్లో పలావు పంపిన పోలీసుఇన్స్పెక్టరునీ, ఆ నలభై ఏళ్ళ నర్సునీ ఓ పక్కమీద ప్రతిరాత్రీ చేర్చారు వాళ్ళమాటల్లో, నిశ్చింతగా. తరువాత వాళ్లిద్దరిమధ్యా ఏం జరుగుతుందో కూడా, డిటెయిల్సు వూహించి వర్ణించుకునే వారేగాని, అది బూతుగనక వాళ్ల పెదిమలు ఉచ్చరించవు. అంతానిశ్శబ్దంగా, కలలోనే.

వార్డులోంచి డాక్టరు కామేశ్వర్రావు వొచ్చాడు. "ఏమిటి కూచున్నారు తీరికగా! పన్నెండో నెంబరుకి నోట్లోంచి రక్తం పడుతోంది."

"మేమేం చెయ్యేం? మందివ్వండి కట్టడానికి."

"ఇవ్వక ఏంచేస్తున్నాను? కాని....."

"ఎవరికో వొకరికి ఎక్కణ్ణించో ఒక్కణ్నించి ఏదో ఒకటి పడుతోనే వుంటుంది. మేమేం మనుషులమేనంటారా? మీకేం? రెండు ముక్కలు పుస్తకాంలో రాసి ఇంటికిపోయి చీట్లపేకలాడుకుంటారు."

"పోయినవారం ఆరోగ్యశాఖ మంత్రిగారిచ్చిన ఉపన్యాసం విన్నారా" అని అడిగాడు డాక్టరు.

"ఆ. సావధానంగా విన్నాం. మళ్ళా అదే రేడియోలో విన్నాం. మళ్ళా అదే న్యూస్ పేపర్లలో చదివాం. అదే హెడ్నర్సు లెక్చరుగా చెప్పింది. అదే అంతకు పూర్వపు మంత్రిగారు శలవిచ్చారు. రాబోయే మంత్రిగారు అదే మాట్లాడ బోతున్నారు. మా ఎలవెన్సుల సంగతేమిటంటే ఒకరూ మాటాడరు." అంది బాలమ్మ. "రోగులే మాపిల్లలట."

"ఆ మంత్రిగారికి పదకొండు మంది పిల్లలే" అంది ఎలజబెత్తు.

"పోనీలే రోగులు మనపిల్లలైతే మన మొగుళ్లెవరు?"

"డాక్టర్లు" అని నవ్వింది ఎలిజబెత్తు. నవ్వి కామేశ్వరరావు వంక చూసింది.

"అట్లా ఓ జి. ఓ. ప్యాస్ చేస్తే." అంది నర్సు బాలమ్మ నవ్వుతో.

"అలెవెన్సులకి డబ్బులేదట."

"మరి మందుల ఇన్‌డెన్‌టులో ఆ రెండు లక్షల వ్యవహారం సంగతేమిటి?"

"ఎవర్నడుగుతావు?"

"ఇంతకీ...." అంటో వుండగా ఇందాక వెళ్ళిన ముగ్గురు విద్యార్థులూ నవ్వుకుంటో పరిగెత్తుకొచ్చారు.

"ఏమిటి, అప్పుడే అయిందా ఆపరేషను?"

"ఇవాళిటికి ఒక్కటే వేసుకున్నాడు దొర."

"ఏం?"

"చప్పున ఇంటికి వెళ్లాలని"

"ఎందుకు?"

"అతని గెస్టు-ఇంగ్లండునించి రాలా - న్యూస్‌ప్రింట్ ఏజంట్ - అతనూ దొరసానీ వొంటరిగా బంగళాలో కలిసి వుండడం ఇష్టంలేక, మండి చస్తున్నాడు మానవుడు."

"ఆ వొక్క ఆపరేషను రోగీ, తీరాచూస్తే చచ్చిపోయి ఉన్నాడు."

"అదృష్టం అట్టా కలిసి రావాలి."

"ఆస్పత్రి అదృష్టం సరే, ఇంటిదగ్గిర అదృష్టం ఎట్లావుందో! దొరకి!"

"సరేకాని డాక్టర్, ఈ వార్డులో మీకు నంబరు ఇరవైఒకటి తెలుసూ? మనవూరే కదూ?" అని అడిగాడు శ్రీనివాస్.

"నంబరు ఇరవై ఒకటి సంగతి తెలీదు కాని"

"ఆతల్లికీ, ఆకొడుక్కీ విరోధం-"

"అదంతా నాకు తెలీదు. కాని ఆ తల్లి కేస్ వైద్యకంగా ఇంటరెస్టు. వింటారా?"

"కానీండి. ఒంటిగంటదాకా తిండి తొందర లేదు."

ఇట్లా చెప్పాడు డాక్టరు కామేశ్వర్రావు నా పేషంట్లని దైవానికి వొప్పచెప్పి:

"మాతో హైస్కూల్లో కనకయ్య అనే కుర్రవాడు చదువుకునేవాడు. తెలివైనవాడు, అందరిలోకీ. తలిదండ్రులు చాలా బీదవాళ్లు. అతనికి హటాత్తుగా పెద్దజ్వరం వొచ్చింది. రావడమే హడావిడిగా వొచ్చి హెచ్చిపోయింది. ఆ వూరికి ఒకడే ఇంగ్లీషు వైద్యుడు. ఆ రోజుల్లో ఆస్పత్రిడాక్టరు సాయేబు. అతను మందిచ్చాడు. కాని మర్నాటికి కనకయ్యకి స్మృతితప్పి తప్పుడు మాటలూ కలవరింపులూ ప్రారంభించాడు. ఏ చిన్న జ్వరానికీ కలవరిస్తాట్ట. అతను చాలా నర్వస్‌బాయ్. సాధారణంగా చురుకైన కుర్రాళ్ల అంతనర్వస్‌గానే

వుంటారు. మా టీచరూ, కుర్రాళ్లూ అందరం రెండు పూటలా కనుక్కుంటున్నాము. మా హెడ్మాష్టరు అడిగితే డాక్టరు అతని జబ్బు సెప్టిసిమియా అన్నాడు. నయమౌతుందన్నాడు. రెండో రోజు రాత్రికి జ్వరం మరీ హెచ్చింది. వూరివాళ్ళకందరికీ తెలిసి ఆదుర్దాపడుతున్నారు. బీదవాడు కావడంచేత చిన్నప్పటినించీ కనకయ్య అందరిఇళ్ళల్లో వారాలు చేసుకున్నాడు. చందాలు పోగుచేసుకుని బడిజీతం కట్టేవాడు అతని తండ్రి-వూరి పురోహితుడు. అందరికీ ఆ తండ్రినిచూసినా, కొడుకుని చూసినా ప్రేమ.

ఆ రాత్రి భయపడి అందరూ ఆయుర్వేద వైద్యుడు గోపయ్యగారిని పిలిచారు. ఆయన రోగినాడి చూడగానే ఆ జ్వరం దోషగుణమన్నాడు. దానికి ఒకటే చికిత్స. ఏ స్త్రీ సంపర్కసమయంలో దోషగుణం తగిలిందో ఆ స్త్రీ తొడలో రక్తం తీసి దాంతో కలికంచేసి రోగి కంట్లో పెట్టాలి. వైద్యుడు గోపయ్యగారి మాటని అందరూ కొట్టేశారు. కనకయ్య చాలా కుర్రాడు. అందం లేదు. స్ఫోటకం మచ్చలు. చదువు తప్ప ఇంకో ధ్యాస లేదు. ఆరోజుల్లో మనుషులికి (అందులో మావూరు పల్లెటూరు) ఇంగ్లీషు వైద్యాన్ని చూస్తే చాలా అనుమానం.

"అనుమానించడం ఏమిటి?" అంది ఎలిజబెత్తు.

"అంటే దోషగుణం స్త్రీ సంపర్కంవల్లరాదు."

"అదేమిటి?"

"వొంటో జబ్బుగా ఉన్నప్పుడు...."

"మరి వైద్య గ్రంథాలలో ఎక్కడా లేదే?"

"ఇంగ్లీషు గ్రంథాలలో లేదు."

"మరి నిజమంటారా?"

"అదేసంగతి. ఈ కథనివిని మీరే నిర్ణయించాలి. వినండి. చివరికి 'ఏమో, అతను మంచివాడే. కాని ఏ సమయంలో ఏ కులట అతన్ని దుర్మార్గం చేసిందో! దేనికి అట్లాంటి పోయే బుద్ధిపుట్టిందో! ఏం మంచిమాటలు చెప్పి. డబ్బిచ్చి, మోసగించిందో?' అన్నారు.

"సాయేబు డాక్టరుతో చెపితే, 'వుత్తనాన్సెన్సు! దోషగుణం అనే జబ్బేలేదు. పో'మన్నాడు.

"దాంతో ప్రజలకి ఆ డాక్టరుమీద విశ్వాసం పోయింది. ఆ స్త్రీ ఎవరు అనేదే ప్రశ్న.

"మావూరి ప్రాణానికి 'ఆ స్త్రీ ఎవరు?' అనే ప్రశ్న, గవర్నరు జనరల్ని కాల్చి చంపిం దెవరు ? అని పత్రికలోపడ్డ సమస్యకన్న పెద్ద సెన్సేషన్ అయింది. రోగిని అడుగుదామంటే, అతనికి మతిలేదు. ఎట్లా? ఆవూళ్లో షెర్లాక్సుహోమ్సు ఎవడూ లేదు. కాని అందరూ డిటెక్టివ్‌లే. చివరికి అనుమానం వూరి వెలుపలి గుడిశలో కాపరమున్న 'నాగి'మీద పడ్డది.

గుంపులంతా అర్ధరాత్రి పోయి ఆనాగి గుడిశమీద పడ్డారు. ఆ నాగితప్పు ఆ వూళ్ళో అందరూ పతివ్రతలేనన్నారు. ఎందుకంటే అట్లా ఆ నాగిమీద పడకపోతే. ఎవరికి వారికే భయం. అనుమానాలు. కనకయ్య అందరి ఇళ్ళల్లో భార్యలదగ్గిర, వితంతువుల దగ్గిర చనువుగా తిరుగుతోవుంటాడు. ఒకరు అతనికి తల దువ్వారు ; ఇంకొకరు అతనికి చొక్కా కుట్టించారు; ఇంకోరు అతని చెంపలు నొక్కి ముద్దుచేశారు. ఈ పిడుగు ఎవరి ఇంటిమీద పడుతుందోనని ప్రతివారికీ భయం. అందుకని అందరూ ఏకగ్రీవంగా తమ స్త్రీలందరినీ పవిత్రులని తీర్మానం ప్యాస్‌చేసుకుని, 'నాగి' గుడిశమీద పడ్డారు. నాగిని ఆ రాత్రి ఏంచేసేవారోమరి. ఆ రాత్రికి గవళ్ళ రామన్న, తాగి, నాగి ఇంట్లో పడుకున్నాడు. ఈ గోలకి అతను లేచి కొడవలి పట్టుకొని.

"రండిరా ఎవరడ్డొస్తాడో!" అనేప్పటికి 'నాగి'ని అనవసరంగా అనుమానించామని నిశ్చయించుకుని ఎవరి ఇళ్ళకి వాళ్లు చల్లగా సర్దుకున్నారు.

కాని, ఆలోపల కనకయ్య తలిదండ్రులు మధనపడుతున్నారు వాళ్ళఇంటో. ఎందుకంటే జ్వరం ప్రారంభంనించీ కనకయ్య 'శారదాంబ' 'శారదాంబ' అని కలవరిస్తున్నాడు.

శారదాంబగారంటే ఆ వూరికి శారదాదేవి అవతారం. అందం. గొప్పఇల్లాలు. శ్రీమంతుడిభార్య. ఆమెకి ఒక్కడే కొడుకు. కనకయ్యకి దూరపుబంధుత్వం. హైస్కూల్లో ప్రవేశించిన తరవాత వారానికి మూడురోజులు అతని భోజనం శారదాంబగారి ఇంటోనే. ధనసహాయము వాళ్లే-చాలవరకు.

పరపురుషుడన్నమాట ఆమె విషయంలో అనడానికి యమధర్మరాజేమిటి, సీతని నిప్పులో దూకించిన శ్రీరాముడు కూడా భయపడతాడు. ఏ విధంగానూ యోచించుకోలేము. చాలా ధర్మాత్మురాలు. ఆ వూరికి తల్లి.

మొదట్లో కనకయ్య 'శారదాంబగారు' అని అదేపనిగా కలవరిస్తే, ఆమె పనులు ఎక్కడ లోపమైనాయనో, లేక ఆమె తన దగ్గిరవుంటే తనకింత బాధ వుండదనో కలవరిస్తున్నాడను కున్నారు.

శారదాంబగారు రెండుసార్లువొచ్చి కనకయ్యని చూసి ఏడ్చి వెళ్లారు. వాళ్ళఇంటో నవరాత్రి ఉత్సవాలూ, ఎడతెగని బ్రాహ్మణ సంతర్పణలూ విధిగా జరిపి తీరనక్కర్లేకపోతే ఆమె కనకయ్య దగ్గిరే కూచుని వుండేదేమో అస్తమానమూ అనిపించింది. ఆమె విచారాన్ని చూసి ఆమెహృదయం ఎంత కరుణాపూరితమో అని ఆశ్చర్యపడ్డారు.

కాని వైద్యుడు 'వ్యాధిదోషగుణ' మనడమూ, కనకయ్య శారదాంబగారినే పలవరించడమూ. ఎల్లాగైనా ఆ స్త్రీ ఎవరో తెలుసుకుని కొడుకు ప్రాణాన్ని రక్షించుకోవాలనే ఆదుర్దా ఆ తలితండ్రుల అనుమానాల్ని రేపాయి. కాని శారదాంబ! ఆమె ఎట్లా అనుమానించడం!

గతిలేక సంధిలోవున్న కుర్రాణ్ణి లేపి "ఏమిట్రా శారదాంబ, శారదాంబ అంటావు? ఏమిటి సంగతి ఎందుకు? మాతో చెప్పు నాయనా! ఎవరితోనూ చెప్పం" అని ఎంత బతిమాలినా అతనికి స్పృహలేదో, లేక అతను చెప్పదలచుకోలేదో! వాళ్ళకి ఏమీ జవాబురాలేదు.

జబ్బు ఎక్కువవుతోంది. ఇంక ఇరవై నాలుగుగంటలన్నా బతుకుతాడో లేడో అనుమానమయింది. ఇంక తల్లి డెస్పరేట్ అయి ఆ తెల్లారకట్టే లేచి శారదాంబగారి ఇంటికి వెళ్ళి దొడ్లో కూచుంది, శారదాంబగారు లేచి వచ్చిందాకా.

"మీరా, ఎవరో అనుకున్నాను. ఎట్లావుంది కనకయ్యకి?"

"ఎట్లా వుందని చెప్పను తల్లీ ! ఇంక లాభం లేదన్నాడు గోపాలంగారు. ఇంక రేపో మాపో" అని గొల్లున ఏడ్చింది. శారదాంబ ఆమెని తన గుండెల కదుముకుని ఓదార్చింది.

కనకయ్యతల్లి చప్పున ఆమె కాళ్ళమీద పడి,

"నాకు పుత్రభిక్ష పెట్టు తల్లీ" అని రెండు కాళ్ళూ పట్టుకుంది. ఆశ్చర్యంతో ఆమెని లేవనెత్తి, నంగనాచిగా, "ఏంచేస్తాం? దైవంమీద భారం వెయ్యి. ఏం ఫరవాలేదు. నేను వొచ్చి చూస్తాను" అంది శారదాంబ.

"అట్లా కాదు. నువ్వే రక్షించాలి. లేక లేక ఒక్కకొడుకు నాకు. వాడుపోతే నేనేం చూసుకు బతకను?" అని ఏడ్చింది.

"నేను మాత్రం ఏం చెయ్యగలనమ్మా, నేనైనా మనిషినేకదా! దేవి పూజాకుంకం పెడతాను. తీసుకువెళ్ళు. తరవాత దేవుడున్నాడు. నీకడుపుకి అంత అన్యాయం చెయ్యడు ధైర్యంగా వుండు"

"మామూలు జ్వరం ఐతేసరే, ఏదో మందో మాకో తింటారు. కుదుట పడవొచ్చు. దోషగుణం అంటున్నారు కదా ! మరి ఏ తల్లి ఆ పుణ్యాం కట్టుకుందో గాని !"

"ఆ గోపయ్య ఏమిటి? వాడికేం తెలుసు? ఆస్పత్రి డాక్టర్ని మాన్పించడ మేమిటి మీరు? ఖర్చు అవుతుందంటే మావారు ఇవ్వరా? దోషగుణం ! చెప్పు తీసుకు కొట్టే వాడు లేక ! అంత చిన్న కుర్రాడికి దోషగుణ మేమిటి? ఎవరన్నా నవ్వుతారు. మీరెట్టా నమ్మారమ్మా!"

"కాదమ్మా ! అది దోషగుణమే, అన్నీ ఆ లక్షణాలే. ఇంకో జ్వరమైతే ఇట్లా ముంచుకురాదు."

"మరి తగ్గించడేం ఆ గోపయ్య ?"

"ఎట్లా ? ఏంమందు వెయ్యాలో తెలిస్తేగా ! ఆ మహాతల్లి బైటపడి వొప్పు కుంటుందా ? నా కింత కొడుకును దానం చేస్తుందా ? నా వంశం నిలబెడు తుందా ?"

బాగా బూతులు తిట్టేదే-శారదాంబకు కోపం వచ్చి. తనపని చెడుతుందని గాని.

"మరి కనకయ్యని అడగలేదా ?"

"అడిగాము. వాడికి స్పృహ వుంటేగా"

అని, ధైర్యంచేసి.

"జ్వరం వొచ్చినప్పటినించి సంధిలో ఒక్కపేరే వాడికి స్మరణ-'శారదాంబగారు' అని

- అని ఆగింది. "ఏమడిగినా 'శారదాంబగారు' అంటున్నాడు" అంది మళ్ళీ.

"పాపం! వాడికి ఎంత భక్తో నామీద ! చాలా మంచికుర్రాడు. ఎట్లా చెపితే అట్టా విని శ్రద్ధగా చేసేవాడమ్మా" అని కళ్ళనీళ్లు పెట్టుకుంది శారదాంబ.

తల్లికి వొళ్లుమండి సొంత కవిత్వంలోకి వెళ్ళి, తన పని సాధించుకోడానికి.

"శారదాంబగారూ, నాకు తెలీదండీ, నన్నడక్కండి. నాది అట్లాంటి బుద్ధిగాదండీ అని కలవరిస్తున్నాడమ్మా" అనేశింది.

"అవును. అదేనా ? నాలుగు రోజులకిందట గూట్లో ఆరురూపాయలు పెట్టాను. కనపళ్ళేదు. అతనికేమన్నా దేనికన్నా ఇచ్చి మరిచిపోయినానేమోనని అతన్ని అడిగాను. అదిగావును కలవరిస్తున్నాడు. అబ్బ ! ఎంత సుతిమెత్తనమ్మా వాడి మనస్సు !"

ఇంక ఆ తల్లి తన హృదయాన్ని ఆపుకోలేక "పుణ్యం పాపం దేవుడికి ఎరక. తల్లీ, నిన్ననడానికి నాలిక పీక్కుపోతోంది. కాని ఎంత పతివ్రతలకైనా, ఏదో నిమిషాన ఏ పొరబాటు బుద్ధి పుడుతుందో చెప్పలేము....నువ్వు నీరక్తం ఇచ్చి నా కుర్రాణ్ణి రక్షించాలి, వాడు నువ్వేనని చెప్పాడు.

"తల్లీ ! ఎవరికీ తెలీనీను. నీకూ నాకూ మధ్యే ఆ రహస్యం. ఈ జన్మంతా నీ ఇంటో ఊడిగం చేస్తాను" అంది.

అప్పటికీ ఏం అర్థంకానట్టే నటించింది శారదాంబ. "ఎందుకు నా రక్తం? రక్తం ఎక్కించాలన్నారా ఆస్పత్రివాళ్లు ?"

"కాదమ్మా! దోషగుణం కదూ !"

ఆ మాటతో నసాళాని కెక్కింది శారదాంబకి.

"ఏమిటి? అదేమిటి !" అంది తెల్లబోతో, తెల్లనయ్యే తూర్పుదిశ పడే ఆశ్చర్యం మల్లే.

"ఏదో పొరపాట్లు వొస్తాయి ఎటువంటివారికీ. మిమ్మల్నే మనటంలేదు. మా వాడికి ప్రాణభిక్ష పెట్టు...." అంటూండగా.

"ఇంక మాట్లాడకు, వెళ్ళిపో. ఇదా? అట్లాంటిదాన్ని అనుకున్నావా నన్ను? నీ కనకయ్య నా కన్న కొడుకుతో సమానం. పో. ఎక్కడా అనకు ఆమాట. నీ మతి చెడిపోయింది. పో. ఇంటికి పో. ఎవరన్నావింటే మొహాన పేణ్నీళ్లు చల్లుతారు. పో"

అని ఆమెని వీధి వాకిలివేపు నెట్టి ఇంట్లోకి వెళ్ళిపోయింది. శారదాంబ.

ఆ ఉదయంనించి వూరివాళ్లు కనకయ్య ఇంటివేపు రావడం మానేశారు. ఎవరి మొహం కనపడితే అతను ఎవరి పేరు చెపుతాడోనని భయం. ఆడవాళ్లు ఎవరూ తొంగి చూడనన్నాలేదు! సాయంత్రమయ్యేటప్పటికి కనకయ్యని కింద పెట్టవలసిన స్థితి చాలా సమీపించింది. తలిదండ్రులు డెస్పరేట్ అయిపోయారు. అర్ధరాత్రి శారదాంబగారి ఇంటికిపోయి తలుపుకొట్టి ఒకటే తిట్లూ, శాపనార్ధాలూ-ఆమె తన కొడుకుని చంపిందని, ఆమె వ్యభిచారని అనరానిమాటలన్నారు.

"ఏ మెరగని మాకుర్రాడే దొరికాడా? నీ కంత మదమెక్కువైతే మొగాళ్ళు లేరా ? వడ్డీవాళ్లు లేరా? మృగాలు లేవూ" అంటో.

ఆమె భర్త తలుపుతీసి కనుక్కున్నాడు. అతని కాళ్ళమీద పడి బతిమాలారు. వాళ్ళ వెనకనే వైద్యుడు గోపయ్యకూడా వున్నాడు. శారదాంబ బైటకు రానేలేదు. ఆమెభర్త వాళ్ళమాటలు ఏమాత్రమూ నమ్మలేదు. నమ్మినా, అనుమానం వొచ్చినా, ఏ భర్త నమ్మినట్లు పైకి కనపడతాడు? గదిలోకి వెళ్ళి ఆమెనడిగాడు.

"ఇదేమిటండీ ! సిగ్గులేకుండా మీరు ఏమని అడగవొచ్చారు నన్ను ? ఇదేమిటి ? పిచ్చిపుట్టి వాళ్లు ఏడిస్తే రెండు చీవాట్లుపెట్టి బైటికి ఈడవక నాదగ్గరికి వొచ్చి అడుగుతున్నారా ?"

అతను "ఏమో ! ఆడదాన్ని నమ్మిందెవరు ? కాకపోతే వాళ్ళు నీమీ దెందుకు పడతారు ? నిజం కానీ అబద్ధంకానీ, ఆ కుర్రవాడు చస్తే, ఆజన్మాంతం వూరూరా నిన్ను తిట్టుకుంటో తిరుగుతారు. ఎట్లానూ అపవాదు తప్పదు. పోనీ రక్తం ఇస్తేనేం పోయింది? వాడు ఎట్లానో చస్తాడు. నీ నిర్దోషత్వం రుజువౌతుంది" అన్నాడు.

"ఛీ. ఛీ. అట్లాంటిమాట నాముందు అనకండి. నారక్తం ఇస్తే నేను వొప్పుకున్నట్టు కాదా? ఆ వెధవ నాపేరు పలవరించడమేమిటి ? ఆ పలవరింపుమాట పట్టుకుని....."

"అంతా ఖర్మ! ఏంచేస్తాం ! నువ్వే ఆలోచించు. వాళ్లు పోనీ, నేను చెపు తున్నానుగా. నా మాటకోసం ఇయ్యి." అని శతవిధాల చెప్ప వొప్పించాలని చూశాడు. ఆమె ఏ మాత్రం వొప్పుకోలేదు.

కాని ఆమెభర్త చాలా పట్టుపట్టాడు. ఒకరికి ప్రాణదానంకోసం త్యాగమనుకో అన్నాడు. పూర్వపు పతివ్రతల్ని, శరీరం కోసి ఇచ్చిన శిబిని, చర్మంకోసి ఇచ్చిన కర్ణుణ్ణి జ్ఞాపకంచేశాడు. కనకయ్య తలిదండ్రులచేత, వైద్యుడు గోపయ్యచేత ప్రమాణాలు చేయించాడు, ఎవరితో

చెప్పమని. అప్పటికీ ఆమె అంగీకరింపలేదు. చివరికి గొడ్డును పడేశినట్టు ఆమెనిపట్టుకుని రక్తం తీసికెళ్ళారు. కలికంచేసి అతని కంటోపెట్టారు.

వారంరోజుల్లో కనకయ్య స్వస్థతపడి బడికి వొచ్చాడు-

అని, ఆగాడు డాక్టరు కామేశ్వరరావు.

"దోషగుణం అనే జబ్బు నిజంగా వుందంటారా డాక్టర్" అని అడిగాడు వెంకటప్ప.

సముద్రంమీద మబ్బు వేస్తోంది. చిన్నగాలి అలలమీద ముగ్గుపెట్టింది. సముద్రపు అధికారులకి ఎవరికో రహదారి ఏర్పరుస్తున్నట్టు సముద్రంమధ్య తెల్లటి చారపరుచు కుంటోంది. గాలిలో హెూరు సద్దుమణిగింది.

"లేకేం, నిస్సందేహంగా వుంది."

"మరి మాపుస్తకాల్లో లేదేం ?"

"ఒక్కటి నేర్చుకోండి. నేర్చుకోడ మెందుకు ? మీరు డాక్టర్లు ఐన తరవాత చాలా త్వరలోనే మీ పుస్తకాల్ని నమ్మడం మానేస్తారు. మానెయ్యకపోతే చాలా మూర్ఖులన్నమాట"

"మరి యీ వైద్యశిక్షణ అంతా ఎందుకు ?"

"ఏం చెయ్యకూడదో చెప్పడానికి. మనకి తెలిసింది చాలా స్వల్పమని తెలుసుకోడానికి"

"మరి ఆ రక్తమే మందా ఆ జబ్బుకి"

"అదే ఇంతవరకు తెలిసిన మందు"

"మరి దోషగుణమని తెలుసుకోవడం ఎట్లా ?"

"తెలుసుకోనక్కర్లేదు"

"ఎందుకు ?"

"బతక తలుచుకున్న వాళ్ళెవరూ దోషగుణానికి వైద్యం చెయ్యమని అలోపతీ డాక్టర్ని పిలవరు"

"ఏదో జ్వరమనుకుని పిలిస్తే ?"

"పిలిస్తే రోగి చచ్చిపోతాడు. ఇంతలో పొయిందేముంది? మీ ఫీజు మీకు వొస్తుంది."

"మరి డాక్టరుకి అప్రదిష్ట కాదా ?"

"ఏమీకాదు. రోగికి ఆయువు మూడింది. మేమేం దేవుళ్ళమా అంటాము."

"ఐతే మనదేశానికి ఆయుర్వేదమే ఉపయోగం"

"కాదు. ఎందుకంటే, ఆయుర్వేద వైద్యులకి ఏం చెయ్యకూడదో అదికూడా తెలీదుగనక"

"మీ డిస్కషన్ సరేలెండి. కథ అయిపోయిందా, ఇంకా వుందా ? ఆరోగికి రక్తం కట్టిందో లేదో పోయి చూడాలి నేను" అంది నర్సు ఎలిజబెత్.

"ఇంకొంచెం వుంది"

"అయితే ఇంత వగలుపోయిన ఆ మహా ఇల్లాలన్నమాట అంత పని చేసింది?" అంది నర్సు బాలమ్మ.

"ఎంతపని చేసిందేమిటి ? అందరూ చేసేపనే ఆమే చేసింది. ఇంత విపరీత మౌతుందనుకోలేదు కదూ? అది ఆమె దురదృష్టం"

"కాని తనమూలంగా ఆమాయకుడైన కుర్రాడి ప్రాణం పోతోవుంటే, ఆ దిక్కుమాలిన తల్లితండ్రులు ఏడుస్తోవుంటే అంత కఠినత్వం-అది మానుషత్వం కాదు. అది రాక్షసి."

"అట్లానే అనిపిస్తుంది. దూరంగా కథగా వింటోవుంటే, మరి ఆమె స్థితిలోవుంటే మనలో ఎవరమన్నా ఆమెకన్న ఉదారంగా ప్రవర్తించే వాళ్ళమా అనేది ఎవరికివాళ్ళం ఆలోచించుకోవలసిన విషయం. ఆమెకి దగ్గిర దగ్గిరగా నలభైఏళ్ళు. ఆమెకు చాలా ప్రతిష్టా, గౌరవమూ...."

"అట్లాంటిది ఆపనే చెయ్యకూడదు."

"ఏ మెరగని కుర్రాడితో."

"ఏమో. ఎవరినించో ప్రేరేపణ? అతనినించో, ఆమెనించో. ఎవరికి తెలుసు?"

"అతనా? బళ్ళోకుర్రాడు. ఆమె నెందుకు బలవంతం చేస్తాడేం?"

"ఆమెమాత్రం? భర్తవున్నాడు. ఒక కుర్రాడూ, ఇద్దరు ఆడపిల్లలూ, ముగ్గురు పిల్లలు. తనకొడుకులా తిరిగేకుర్రాడు"

"మీరేమంటారు డాక్టర్ ?"

"నాకూ తెలీదు. కాని నా అనుభవాన్ని బట్టి ఏమంటానంటే...."

"మీ కిట్లాంటి వాటిల్లో చాలా అనుభవమా డాక్టర్" అన్నాడు. మూడో అతను నవ్వుతో.

"నా స్వంత అనుభవం అఖ్ఖర్లేదు. మనదగ్గరికి వొచ్చిన రోగుల దేహాలకి ఏం జబ్బులో చూసి మనం చదువుకున్న మందులు వ్రాసి ఇచ్చిపంపితే ఏ అనుభవమూ రాదు. కాని మనని నమ్మివొచ్చిన మనిషి రోగంలోకి దిగాడంటే, ఎందుకు దిగాడు? ఏపరిస్థితులు? మందుతో నయంచేస్తాం. కాని ఆమనిషికి ఓ శరీరం, పరిసర పరిస్థితులు, ఆహారం, అలవాట్లు, ఓ మనసు ఇవన్నీ గుర్తించామా, వైద్యమనేది ఎంత అగాధమని!"

"అట్లా చూస్తే ఏం నయం చెయ్యగలం?"

"చెయ్యలేము. ముప్పాతిక మంది మనం తినమనే తిండి దొరకని వాళ్లు. అదంతా పోనీండి. నా అనుభవం నా రోగుల్నించి వొచ్చింది" అని సముద్రం వంక చూస్తున్నాడు కామేశ్వర్రావు.

"ఆ అలలూ, ఆ నురుగూ చూస్తున్నారా? అవి రోగాలనుకోండి. ఎన్ని అలల్ని ఆపుతారు? ఎంత నురుగుని తుడిచేస్తారు?"

"నేను పోవాలి. కథ కానిస్తారా లేదా?" అంది నర్సు బాలమ్మ.

"తరవాతా? ఆ కనకయ్య ఒక వికృతమైన పురుగు ఐయిపోయినాడు. బళ్ళో టీచర్లు ఏమీ అనకపోయినా, 'కనకయ్యా!' అని పిలవడంతోనే మాకు నవ్వూ, అసహ్యం వొచ్చేవి. కొందరికి జాలి.

"ఎట్లావుందిరా!" అనేవాళ్లం. అంటే తెలుస్తోందిగా! 'ఏంచేశావురా' అనేవాళ్లం. వాడేమంటాడు? ఛీ, ఛీ, పొండిరా! అనేవాడు. అంతకన్న ఏమంటాడు? సరే శారదాంబగారి ఇంటికి ఎట్లానూ వెళ్లడనుకోండి.

"శారదాంబ! శారదాంబ." అనేవాళ్లు వాడి వెనక. వూరివాళ్లు ఒక్కరూ అతన్ని వాళ్ల ఇంటికి రానీలేదు. త్వరలో తలిదండ్రులతో చెప్పకుండా ఎక్కడికి పోయినాడో పోయినాడు.

"మళ్ళీ కనపడలేదా?"

"లేదు. మర్నాటినుంచే ఆమె భర్త ఆమెని ఎట్లా చూసివుంటాడో మనం వూహించుకోవచ్చు. చర్మంలేని కర్ణుణ్ణి. వెన్నెముకలేని దధీచిని ఎట్లా చూశారోగాని తప్పకుండా కనకయ్య చచ్చిపోతాడనీ, తన భార్య నిర్మలత్వం రూఢి ఔతుందనీ అనుకుని వుంటాడు. సీత అగ్నిలో కాలిపోయిందనుకోండి. శ్రీరాము డేమై వుంటాడు. కాలిపోతూవుంటే బాధని భరించలేక సీత చితిలోంచి బైటికి దూకితే ఏం చేశేవాడు శ్రీరాముడు? పైగా వూరంతా నవ్వు. అసహ్యం.

ఏదో వో పనిమీద ఆమె ఇంటికి వెళ్ళి ఆమెనిచూసే స్త్రీలసంఖ్య అమిత మయింది. ఇన్నాళ్ళూ ఆమెమీద వుండే ఆధిక్యతా, గౌరవం వుత్తవిషమై పోయినాయి.

అకస్మాత్తుగా ఆమె ఆవూరినించి మాయమయింది. ఆమె చెల్లెలి కూతురు కాన్పుకి శారదాంబ వెళ్లిందన్నారు. ఈనాటికీ ఆ కాన్పు కానేలేదు. ఆమె కొడుకు సుబ్రహ్మణ్యం మాబళ్ళో చదువుకునేవాడు. ఇంక మా మాటలు పడలేక బడిమానేశాడు. వూళ్ళో తిరగడం, ఆడుకోడం అశక్యమైపోయింది అతనికి. అంతేకాదు. రెండేళ్ళలో ఆ తండ్రి అంత పెద్ద ఆస్తినీ చాలా తక్కువకి అమ్ముకుని కొడుకుని తీసుకుని ఆవూరినించి వెళ్ళిపోయినాడు.

ఇద్దరు కూతుళ్లకీ అదివరకే పెళ్ళి అయిపోయి అత్తవారింటికి వెళ్ళారుగాని కాకపోతే వాళ్లకి పెళ్ళిళ్లు అయ్యేవి కావు-అని, ఆగాడు కామేశ్వర్రావు.

"అయిపోయిందా కథ?" అంది నర్సు బాలమ్మ.

"ఆ"

"సరే ఈ మనుషులేనా వాళ్లు?"

ఆ బైట నుంచున్న దౌర్భాగ్యురాలే శారదాంబగారు. ఆ వూరునించి వెళ్లాక వాళ్లు బీదవాళ్ళైనారు. ఆ తండ్రి త్వరలోనే చచ్చిపోయినాడు. ఈ కొడుక్కి పెళ్లికాలేదు. సంసారం లేదు."

"ఇన్నాళ్ళూ ఈ తల్లి ఎక్కడవుందో?"

"సందేహమేముంది? ఇదంతా ముందే ఏర్పాటు చేసుకున్నారు. కనకయ్య దగ్గిరికి పోయి కాపరం పెట్టి వుంటుంది. ఆ కుర్రాడు ఈ ముసలిదాన్ని ఎన్నాళ్లు భరిస్తాడు? అక్కణ్ణించి బైలుదేరి ఇంక గతి లేక నౌకరీలు చేసుకుంటోందిగావును' అన్నాడు మెడికల్ విద్యార్థి నాగయ్యచౌదరి.

"ఎంతెంత వుంటాయో మనుషుల్లో? ఓ కుర్రాడి కోసం పండంటి కాపరాన్ని సర్వనాశనమూ చేసిందంటే"

''అందరిలో ఎందుకు వుంటాయి! కొందరు మహానుభావులు లోకం తరింపచెయ్యడానికి ఇట్లా అవతారా లెత్తుతారు."

"ఇంకా సిగ్గులేక ఎందుకు వొస్తుంది కొడుకుని చూసి ఏడవడానికి?"

"ఎంతైనా తల్లిప్రేమ వొకటే ఏడుస్తుంది."

"ఆ కనకయ్య ఏమైనాడో!"

"పోయివుంటాడు. ఆ కుర్రవాడు ఎంతకాలం ఈ ముసిలిదాన్ని పట్టుకుని వేళ్ళాడతాడు?"

"కనకయ్య తల్లితండ్రు లేమైనారో?"

"త్వరలోనే చచ్చిపోయినారు."

అంటో డాక్టరు కామేశ్వర్రావు వెళ్లిపోతున్నాడు.

"మళ్లీ ఆ కనకయ్య మీకు కనపణ్ణేలేదా?" అంది నర్సు బాలమ్మ.

"కనపడకేం? నేనే ఆ కనకయ్యను" అని వరండా మలుపు తిరిగాడు డాక్టర్.

ఒక్క నిమిషం నిశ్శబ్దం, చప్పున అరిచి ఆ ఐదుగురూ పరిగెత్తి డాక్టరు కామేశ్వర్రావుని చుట్టుకున్నారు.

"నిజమా డాక్టర్!"

"నిజమే!"

వాళ్లు అతనిచుట్టూ నుంచుని కదలనీ లేదు.

"చెప్పండి, ఇంక చెప్పండి, అసలు ఏం జరిగింది?"

"ఏమిటి ఏం జరిగింది?"

"ఏమిటి?"

"అదే? మీకు ఎట్లా జబ్బు చేసిందో?"

"నా బొటనవేలుకి దెబ్బతగిలింది. అది సెప్టిక్ ఐ జ్వరం వొచ్చింది."

"అది దోషగుణం కాదా?"

"కాదు."

"ఆమె కాదా? ఆమె ఏం చెయ్యలేదా?"

"ఆమె ఏం చేసిందో కాని నన్నేం చెయ్యలేదు. మెడికల్ కాలేజిలో చేరి, లేడీ విద్యార్థినులు నాపైన పడ్డదాకా నే నసలు స్త్రీ నెరుగను. నాకు చాలా బిడియం."

"ఆమె ఏమీ ఎరగనే ఎరగదా?"

"పాపం, ఏమెరగదు."

"మరి మీ కెట్లా నయమయింది?"

"దానంతట అదే నయమయింది గావును"

"ఆమెకి అంత అన్యాయం జరుగుతోవుంటే మీరెట్లా వూరుకున్నారు?"

"నాకేం తెలుసు? అసలు జరిగినసంగతి, నా కా వూరంతా విరోధం కావడమేగాని! నా తల్లి నాకు చేసిన వైద్యంసంగతి ఏదో అనేది. కాని నాకు అర్థం అయ్యేదికాదు. తొడలో రక్తంతో కలికంచేశారంటే ఆ రక్తం ఇచ్చి రక్షించిందని ఎంతో భక్తికలిగేది శారదాంబగారిమీద. అట్లా రక్తం ఇయ్యడం చాలా నీచమైనపని అనీ, ఏ స్త్రీ చెయ్యదనీ, నా ప్రాణంకోసం ఆమె ఆ త్యాగం చేసిందనీ ఆమెమీద ఎంతో భక్తి కలిగింది. ఆనాటికీ ఈనాటికీ ఆమె నా మనసులో ఆదర్శమైన స్త్రీ. ప్రజలమీద ఆమెదయ, మర్యాద, ఆమె ఇంటిని, అతిధుల్ని చూసే విధం, నెమ్మది, విశాలమైన ఉదారత్వం-హిందూస్త్రీ అంటే ఆమెలో మూర్తీభవించినట్టు వుండేది. జబ్బు నయంకాగానే ఆమెకాడికి పరిగెత్తుకువెళ్లాను. నాజన్మంతా ఆమె పాదాల దగ్గిర అర్పిద్దామని. కాని నన్ను చూడడంతోటే, దెయ్యాన్ని చూసినట్లు చూసి భయపడి తలుపు వేసుకుంది. ఆ దెబ్బతో ఆవూళ్లో వుండడానికి బుద్ధి వెయ్యలేదు. అదిగాక నా చదువుకి డబ్బు సహాయం మానేశారు. నన్ను ఏ ఇళ్లల్లోకీ రానియ్యలేదు. తలితండ్రులే నన్ను నీచంగా చూశారు."

"మరి తరవాత ఆమె ఏమయిందో మీరు కనుక్కోనేలేదా?"

"నాకేం తెలుసు. నేను ముందే వెళ్ళిపోయినాను. నేను కాశీకిపోయి, పేరు మార్చుకుని, సత్రాల్లో, భిక్ష చేసుకుని చదువుకున్నాను. మళ్ళీ ఇప్పుడేచూడడం."

"మరి ఇప్పుడు ఆమెతో ఏం మాట్లాడలేదా?"

"నన్ను గుర్తించలేదు ఆమె. నేనెవరో చెబితే పెద్ద కేక వేసి పారిపోయింది."

"ఎందుకో అంత కోపం మీమీద?"

"చిత్రమేముంది. నామూలానేకదా ఆమెజీవితం నాశనమయింది! నేను కలవరించడం మూలానేగా !"

"ఎందుకు కలవరించారు?"

"ఏమో! నాకెట్లా తెలుస్తుంది. ఆమెమీద గొప్పభక్తి. నా కొక ఈశ్వరి ఆమె. ఆమె వొచ్చి నా బాధని తీసేస్తుందని గావును!"

"అయితే మీకీ కథ అంతా ఎట్లా తెలిసింది?"

"తరవాత ఆవూరుపోయి, తెలుసుకున్నాను"

అంటో డాక్టరు కామేశ్వర్రావు వార్డులోకి వెళ్ళాడు. తక్కినవాళ్ళు ఎవరిపనులమీద వాళ్ళు వెళ్ళారు.

ఈ కధనంతా స్క్రీను వెనకనించి వింటున్న నేను అట్లా సముద్రం కేసి చూస్తో యోచించాను. జీవితానికి, జీవితంలో కలిగే ఈ దురదృష్టాలకీ అర్థమేమిటా అని. ఆ జీవితాలు ఎందుకు అట్లా మసిఐ పోయినాయి? పాపం, వాళ్ళేంచేశారు? ఆమె చేసిన పూజలు, సంతర్పణలు ఏ మైనాయి? దిక్కులేని విద్యార్థిమీద దయ తలిచిన పుణ్యానికేకదా, ఇంత నాశనం కలిగింది ఆమెకి! ఆమూలాన భర్తకి, కొడుక్కి ! ఇన్నేళ్లు ఆమె ఏమయిందో, ఏం బాధలు పడ్డదో! మనుషులు కుక్కలు. యజమాని ఎందుకు డొక్కలో తన్నాడో తెలీక అర్థానికై అతని కళ్లల్లోకి వృధాగా చూసే కుక్కలు. ఎవరు చేస్తున్నారు ఈ ఘోరాలు ? మానవుడా? దేవుడా?

సంఘం - సంఘం చేస్తోంది అని దుమ్మెత్తి పోస్తారు సంఘంమీద ఈ నాటి రచయితలు. సంఘం అంటే మనమే! ఏం చెయ్యాలి? ఎట్లా మారాలి? వీళ్ళని ఆ వూళ్ళో నిలవనీకుండా చేసిన మనుష్యులు మనలాంటి వాళ్ళే.

మరి ఆ సాక్ష్యంతో శారదాంబ నిర్దోషి అని ఆనాడు ఎవరన్నా అనగలిగారా? మరి అంత ఘరానా మనిషి పసి కుర్రాడితో అట్లాంటి పని చేసిందంటే ఆమెని ద్వేషించడం ప్రజల తప్పా! పోనీ, చలం అనేట్టు ఈ వ్యభిచారం దోషం కాదేమో! లేక చాలా ఉత్తమ గుణమే అనుకుంటే తక్కిన దుష్టత్వాలగతేమిటి? ఇంక చెడుగులకీ మంచికీ భేదం లేదంటే అధికారికతా, సంఘమూ ఎట్లా నిలబడతాయి?

అంతే; అంతే; జీవితం అంతే. మరి ఖర్మకాక ఇంకేమంటాము? కాకపోతే ఇంక ఈ అదృష్టానికి అర్థమేలేదు. దేవుడు లేడు. న్యాయంలేదు. సత్యం లేని గుడ్డి ఈ సృష్టి. ఆ సముద్రంలోంచి అనేక నీటిబిందువులు నిరంతరం చిందుతూవుంటాయి. కొన్ని ఎండలో మెరుస్తాయి. కొన్ని కాళ్ళకి తగిలి పగులుతాయి. కొన్ని ఇసికలో మునిగిపోతాయి. కొన్ని సముద్రంలోనే కలిసిపోతాయి మనుష్యులూ అంతే అనాలా?

ఇట్లా జీవితానికి అర్థం. యోచించడమే తక్కువా? కాని హృదయం వున్నవాళ్ళు ఏమీ యోచించకండా, ఏదో లెద్దూ మనకెందుకని ఊరుకోలేరు కదా! కాని, ఇన్ని యుగాలు యోచించి ఓ అద్భుత నిజాన్ని కనుక్కోలేకపోయినారు. ఏ లాభం? మనస్సులు అలిసి, ఏదో ఓ హద్దులో ఏదో థియరీలోనివని సంతృప్తి పడతాయి. ఏవో కొన్ని సూత్రాల్ని నిజమని నమ్మి ఆగకపోతే శాంతిలేదు. కాని వాటిమీద ఇంకా సందేహాలు. మాకు తెలిసి ఇంతే సంగతి అన్నవాళ్లు తెలివంతా వుత్త అలు... బలహీనం. ఏదో సత్యం వుందేమో? ఇంకా మనకు తెలీదేమో! ఎన్నటికీ తెలీదో! కాని తెలుసు ననడం ఇంతేననడం వుత్త అలసత్వం అనుకుంటాను.

◆ ◆ ◆

*ప్రచురణ : **(చలంకథలు - 1వ సంపుటి), దేశీప్రచురణలు 1956.***